సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 25 । మే । 2023



చేపల వేట

వంగర: మండలంలోని రావి చెరువులో స్థానికులు బుధవారం చేపలవేట సాగించారు. చెరువులో నీరు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ఉత్సాహంగా వేట సాగించారు. చేపలు దొరికిన వారు సంతోషపడ్డారు.



వైభవంగా బ్రహ్మోత్సవాలు

గజపతినగరం: వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. వందలాది మంది భక్తులు స్వామివారికి పూజలు చేశారు. హారతులిచ్చారు.



బహిరంగ వేలం

పాలకొండ రూరల్: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 19 వాహనాలను పాలకొండ ఎస్ఈబీ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం బహిరంగ వేలం వేశారు. రూ.91వేల నగదు సమకూరినట్టు ఎస్ఈబీ సీఐ గోపాలకృష్ణ తెలిపారు.

న్యూస్‌రీల్

90 మందికి ఉద్యోగాలు



ఉద్యోగ ధ్రువపత్రాలు అందజేస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: సీతంపేట ప్రభుత్వ ఐటీఐలో వివిధ కోర్సులు పూర్తిచేసిన ఫైనలియర్ విద్యార్థులు 90 మందిజాన్సన్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి చేతుల మీదుగా బుధవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి కంపెనీలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాన్నారు. చిన్నవయసులోనే ఉద్యోగాల్లో చేరడం వల్ల ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు అవకాశం ఉంటుందని, ఆ దిశగా వృత్తినైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ టి.వి. గిరి పాల్గొన్నారు.

బాసంగిలో గజరాజులు



బాసంగి అరటితోటలో సంచరిస్తున్న గజరాజుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి గ్రామ పొలాల్లో 8 ఏనుగుల గుంపు బుధవారం సంచరించింది. పంటలు పాడవుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏనుగులను బీడుభూముల వైపు మళ్లించాలని అటవీశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అక్రమ తవ్వకాలపై కొరడా

విజయనగరం ఫూల్‌బాగ్: గ్రావెల్ అక్రమ తవ్వకందారులపై మైన్స్ విజిలెన్స్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. గంట్యాడ మండలం కొండతామరాపల్లిలో పట్టాభూముల్లో అక్రమంగా 56,538 క్యూబిక్ మీటర్లు గ్రావెల్ తవ్వినట్టు మంగళ, బుధవారం జరిపిన తనిఖీల్లో గుర్తించినట్టు జిల్లా విజిలెన్స్ స్క్వాడ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌పీకే మల్లేశ్వరరావు తెలిపారు. పీఎస్‌కే, వ్రిద్ధి ఇన్‌ఫ్రాటెక్‌లిమిటెడ్ హైవే కంపెనీలకు సుమారు రూ.2 కోట్ల అపరాధ రుసుము విధించామని చెప్పారు.

పచ్చనికొండల్లో ప్రగతి 'బాటలు'

- మన్యంలో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం
- పెద్ద ఎత్తున నిధుల కేటాయింపు
- ఇప్పటికే 20 రోడ్ల నిర్మాణం పూర్తి
- కొత్తగా ఐదు రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు
- రూ.16.56 కోట్లతో ప్రతిపాదనలు



పాచిపెంట మండలం నీలంవలస నుంచి గుమ్మడిగూడ రోడ్డు పనులు



ఆజూరు నుంచి పందిరిమామిడివలస రహదారి నిర్మాణం ఇలా..

పార్వతీపురంటౌన్: మన్యం ప్రజలకు మహర్దశ పట్టింది. నాలుగేళ్లుగా జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. మౌలిక సదుపాయాలు కలుగుతున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంతో పచ్చని కొండల్లో ప్రగతి బాటల నిర్మితమవుతున్నాయి. గిరిజన గూడల ప్రజలకు బతుకుదారి చూపుతున్నాయి. విద్య, వైద్య సదుపాయాలను అక్కరకు వస్తున్నాయి. డోలీ కష్టాలకు చెక్‌చెప్పేలా కొండల వరుసల్లో ఉండే గూడలన్నింటినీ రోడ్లతో అనుసంధానం చేసేందుకు కోట్లాది రూపాయలు ఖర్చుచేయడం కలిసివస్తోంది. తాజాగా, సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని గిరిజన గూడలకు ఐదు రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈఏ కింద పనుల ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేస్తున్నారు. పంచాయతీ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల అధికారులు జాయింట్ సర్వే నిర్వహిస్తున్నారు. వేలాది మంది ప్రజల రాకపోకలకు వీలుగా రోడ్లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 16.09 కిలోమీటర్ల మేర ఐదు రోడ్లను రూ.16.56 కోట్లతో నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. నిర్మాణాలు పూర్తయితే సీతంపేట మండలంలో పూతికవలస–ద్వారబంధం, కురుపాం మండలంలోని అవిరి అర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మత్రిపాడు, అవిరి ఆర్‌అండ్‌బీ రోడ్డు కూడలి నుంచి దిమ్మిడిజోల, అంటిజోల– మనిగ, గుమ్మలక్ష్మీపురం మండలం దేరువాడ–వనకాబడి మధ్య రాకపోకలు సుగమం కానున్నాయి.

ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ విభాగం రూపొందించిన రోడ్డు ప్రతిపాదనలు ఇలా..

- సాలూరు మండలం కొదమ గ్రామ పంచాయతీలో పోయిమాల నుంచి సిరివెర రోడ్డు (1340 మీటర్ల పొడవు, 7 మీటర్ల వెడల్పు, 0.938 హెక్టార్లు)
- సాలూరు మండలం కొదమ గ్రామ పంచాయతీలో తాడిపుట్టి నుంచి డోయివర రోడ్డు (650 మీటర్ల పొడవు, 7.50 మీటర్ల వెడల్పు, 0.487 హెక్టార్లు)
- సాలూరు మండలం కొదమ గ్రామ పంచాయతీలో డోయివర నుంచి పోయిమాల రోడ్డు (1415 మీటర్ల పొడవు, 7 మీటర్ల వెడల్పు, 0.99 హెక్టార్లు)
- మక్కువ మండలం పనసభద్ర గ్రామ పంచాయితీలో బండమెండంగి నుంచి తాడిపూడి రోడ్డు (757 మీటర్ల పొడవు, 7.50 మీటర్ల వెడల్పు, 0.567 హెక్టార్లు

నాలుగేళ్లలో నిర్మించిన రోడ్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 1102 గ్రామాలకు చేరుకునేందుకు వీలుగా 511 బీటీ రోడ్లు, 167 డబ్ల్యూ బీఎం రోడ్లు, 162 గ్రావెల్ రోడ్లను నిర్మించింది. రోడ్డు సదుపాయం లేని మరో 262 గ్రామాలకు రూ.256 కోట్ల వ్యయంతో 345 కి.మీ మేర రోడ్ల నిర్మాణానికి పనులు చేపట్టారు. గిరిశిఖర గ్రామాల్లో మిషనరీ పనుల కోసం రూ.16 కోట్ల వ్యయం అవసరమని ప్రతిపాదించారు. ఐటీడీఏ పరిధిలో రోడ్డులేని గ్రామం ఉండకూడదన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ముందుగా వైద్యసేవలు అందని పల్లెలకు రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నారు.

గిరిశిఖర గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ



గిరిశిఖర గ్రామాలకు రోడ్లు వేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. గిరిజనులకు వైద్యసేవలు అందించేందుకు వీలుగా బాటలు వేస్తున్నాం. కొన్ని గిరిశిఖర గ్రామాలకు రోడ్లు నిర్మించడం కష్టతరమే. ప్రభుత్వం చొరవతో వీటిని పూర్తిచేస్తాం. అటవీశాఖ అనుమతులు రావడంతో రోడ్ల నిర్మాణాలు ప్రారంభిస్తాం. గిరిశిఖర గ్రామాల్లో రోడ్డు లేక వైద్యం అందలేదన్న మాట వినిపించకుండా ప్రగతి బాటలు వేసేందుకు కృషిచేస్తున్నాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

జగనన్న విద్యాదీవెన లబ్ధి రూ.12.90 కోట్లు



జగనన్న విద్యాదీవెన నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

- విద్యార్థుల తల్లుల ఖాతాలకు నిధులు జమ చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి
- పేదలకు ఉన్నత విద్యను అందించేందుకే జగనన్న విద్యాదీవెన
- విద్యార్థులు చదువులో రాణించాలి
- కలెక్టర్ నిషాంత్‌కుమార్

జగనన్న విద్యాదీవెన పథకం లబ్ధి ఇలా...

నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య	లబ్ధి(రూ.లలో)
పార్వతీపురం	4,940	3,91,72,562
కురుపాం	4,894	3,29,36,049
పాలకొండ	4,520	3,09,09,378
సాలూరు	3,549	2,90,06,610

పార్వతీపురం: పేద విద్యార్థులకు ఉన్నతవిద్యను అందించేందుకు ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలుచేస్తోందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జగనన్న విద్యాదీవెన పథకం నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వర్చువల్ విధానంలో తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ కళాశాలల్లో చదువుతున్న పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన 17,903 మంది విద్యార్థినీ, విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు రూ.12.90 కోట్ల నిధులను ముఖ్యమంత్రి బటన్‌నొక్కి జమచేశారన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం కింద జనవరి–మార్చి 2023 త్రైమాసికానికి సంబంధించిన నిధులను విడుదల చేసినట్టు వెల్లడించారు. నమూనా చెక్కు ను లబ్ధిదారులకు అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం, కాపు, క్రిస్టియన్ విద్యార్థుల చదువు ఖర్చులను ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందన్నారు. ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో అధిక ఉత్తీర్ణత శాతంతో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందని, ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల చదువులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చుచేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. చదువుతోనే కుటుంబ ఆర్థిక పరిస్థితి, జీవన స్థాయి మారుతుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి మహమ్మద్ గయాజుద్దీన్, బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జి అధికారి ఎస్.సాంబయ్య, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు బి.సూర్యనారాయణ, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుకు ఆర్థిక భరోసా



మాది నిరుపేద కుటుంబం. ఎస్టీ కులానికి చెందిన మేము పదో తరగతి చదవడమే కష్టం. జగనన్న అమలుచేసిన విద్యాదీవెన పథకం గురించి తెలుసుకున్న మా నాన్న నన్ను ఇంటర్మీడియట్ చదివించేందుకు ఒప్పుకున్నారు. మా కుటుంబానికి జగనన్న అన్నివిధాలా ఆర్థిక భరోసా ఇచ్చారు. వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇల్లువచ్చింది. తమ్ముడికి దివ్యాంగుల పింఛన్ మంజూరైంది. రైతు భరోసా వస్తోంది. నా చదువుకు సాయం అందుతోంది.

– టి.మాధవి, రజ్జిలి, కురుపాం మండలం

జగనన్న మేలు మరచిపోలేం



పేద కుటుంబాలకు చెందిన మేము చదువుకుంటున్నామంటే అది జగనన్న చలువే. చదువుకు పూర్తిస్థాయిలో సాయం అందుతోంది. చక్కగా చదువుకుంటున్నాం. భవిష్యత్తుకు పునాది వేసుకుంటున్నాం.

– సీహెచ్ వినోద్ చక్రవర్తి, కురుపూటి, సాలూరు మండలం

గిరిజనం ఇంట పైనాపిల్ పంట

- మన్యంలో ఆరంభమైన పైనాపిల్ సీజన్
- ఏటా 20 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి
- 5 వేల ఎకరాల్లో పంట సాగు
- ప్రస్తుతం పండు ధర రూ.15 నుంచి రూ.20
- గిరిజన రైతుల ప్రధాన ఆదాయవనరు ఇదే
- గతేడాది ఐటీడీఏ సహకారంతో రైతు బజార్లలో విక్రయాలు



మార్కెట్‌లో క్రయవిక్రయాలు

సీతంపేట: గిరి రైతుల ప్రధాన జీవనాధారమైన పైనాపిల్ సీజన్ ఆరంభమైంది. సీతంపేట మన్యంలో ఈ నెల నుంచి ఆగస్టు వరకు పంట సీజన్ కొనసాగుతుంది. సుమారు 5 వేల ఎకరాల్లో పంట విస్తరించి ఉంది. వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది దాదాపు 20వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో పండు ధర రూ.15 నుంచి రూ.20 మధ్య పలుకుతోంది. గిరిజనులు వారపు సంతల్లో పంటను విక్రయిస్తున్నారు. గత ఏడాది కూడా పంట ఆరంభంలో ఉన్న ధర ఆఖరులోలేదని, పండు ధర రూ.5కు పడిపోయిందని రైతులు చెబుతున్నారు. అప్పట్లో ఐటీడీఏ చొరవతో గిరిజనుల వద్ద నుంచి రూ.12 నుంచి రూ.15 వరకు కొనుగోలు చేసి బయట మార్కెట్లో విక్రయించారు. ఏజెన్సీలో కేరళ రాష్ట్రానికి చెందిన క్యూ రకం పైనాపిల్ సాగులో ఉంది.

ఆ గ్రామాల్లో విస్తారంగా...

కోడిశ, కుశిమి, ముత్యాలు, శంభాం, అక్కన్నగూడ, రాజన్నగూడ, జోగ్గినాయుడుగూడ, తొత్తడి, రామానగరం, అంటికొండ, పొల్ల, దోనుబాయి, మానాపురం తదితర గిరిజన గ్రామాల రైతులు పైనాపిల్‌ను విస్తారంగా సాగుచేశారు. పంట సాగుకు పెద్దగా పెట్టుబడి అవసరం లేకపోవడం, మన్యం వాతావరణం అనుకూలించడంతో అధికమంది గిరిజన రైతులు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ సాగైన పైనాపిల్ నాణ్యమైనది కావడం, రుచి,శుచిలో మేటిగా ఉండడంతో ఒడిశా, తెలంగాణా రాష్ట్రాలతో పాటు కోనసీమ, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, ఏలూరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో డిమాండ్ ఉంది. అక్కడి వ్యాపారులు వచ్చి గిరిజనుల వద్ద పంట కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ఒక్కో పండుపై కనీసం రూ. 10 నుంచి రూ.15 వరకు లాభం వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు.

సంతల్లోనే విక్రయం

పైనాపిల్ విక్రయాలకు గిరిజన రైతులకు సంతలే ఆధారం. సీతంపేట (సోమవారం), మత్రిపాడు (బుధవారం), దోనుబాయి(గురువారం), పొల్ల, కుశిమి (శనివారం)లలో జరిగే వారపు సంతల్లో పంటను విక్రయిస్తున్నారు. గత ఏడాది ఐటీడీఏ చొరవతో ఇతర జిల్లాల్లోని 41 రైతు బజార్లలో రైతు సంఘాల గ్రూపుల ద్వారా పంట విక్రయం జరిగింది. దీంతో గిరిజన రైతులకు అధిక ఆదాయం సమకూరింది.



వ్యాపారులు కొనుగోలుచేసిన పైనాపిల్



పైనాపిల్ పండ్లను విక్రయానికి తీసుకెళ్తున్న గిరిజనుడు

దిగుబడి బాగుంది



ఈ సంవత్సరం పైనాపిల్ సాగుకు వాతావరణం అనుకూలించింది. దిగుబడి బాగుంది. ధరలే వారం, వారం తగ్గుముఖం పడుతున్నాయి. గత వారం రూ.20 వరకు విక్రయిస్తే ఇప్పుడు రూ.15కు ఒక్కో పండు అడుగుతున్నారు. ధరల్లో నిలకడ ఉండడం లేదు.

– సవర జోషి, అడ్డంగి

రైతులకు సహకరిస్తాం



పైనాపిల్ రైతు సరైన ధరలను నిర్ణయించుకుని పంటను విక్రయించాలి. ఒక్క సీతంపేట ఏజెన్సీలోనే పైనాపిల్ పండుతుంది. ఈ ఏడాది మంచి దిగుబడులు వచ్చాయి. రైతులు సరసమైన ధరలకు పైనాపిల్ విక్రయించుకునేందుకు సహకరిస్తాం.

– సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉద్యానవనశాఖాధికారి

మద్దతు ధర వచ్చేలా..



పైనాపిల్ రైతులకు మద్దతు ధర లభించేలా ఐటీడీఏ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. గత రెండేళ్లుగా మిగతా మైదాన ప్రాంతాలకు తరలించి విక్రయాలు చేపట్టాం. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకున్నాం. ఈ ఏడాది కూడా పంట విక్రయాలకు సన్నాహాలు చేస్తాం.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

గజేంద్రులకు పిండప్రదానం

- అడవి జీవులతో అనుబంధం చాటుకున్న గిరిజనులు
- పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలో ఘటన



ఏనుగుల కళేబరాలు పాతిపెట్టిన స్థలంలో పూజలు చేస్తున్న ఎంపీపీ శాంతికుమారి, తోట సింహాచలం, పక్కుడుభద్ర గిరిజనులు



ఏనుగులు తిరుగాడిన చోట అన్నదానం

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని పక్కుడుబద్ర–కాట్రగడ–బి గ్రామాల మధ్య పంట పొలాల్లో ఈ నెల 11న విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన నాలుగు ఏనుగులకు సంప్రదాయబద్ధంగా పిండప్రదానం చేసి తమ అనుబంధం చాటుకున్నారు గిరిజనులు. ఏనుగులను మర ణించిన చోటే రైతు అనుమతితో అటవీ అధికారులు పాతిపెట్టారు. ఆ ప్రదేశంలో పక్కుడుభద్ర తోటల యజమాని, భామిని ఎంపీపీ తోట శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచ లం ఆధ్వర్యంలో పక్కుడుభద్ర, బొమ్మిక, పిల్లిగూడకు చెందిన గిరిజనులు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి వంశధార నదిలో పిండ ప్రదానం చేశారు. అనంతరం ఏనుగులు తిరుగాడిన తోటల్లో అన్నదానం నిర్వహించారు.

నమ్మించి.. గొంతునులిమి...

- స్నేహితురాలే హంతకురాలు!
- ప్రియుడితో కలిసి హతమార్చిన వైనం
- కళ్లేపల్లి బుక్‌కీపర్ మహేశ్వరి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణం
- ముగ్గురు నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచిన పోలీసులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గోవిందరావు, వెనుకన ముసుగులో నిందితులు



హత్యకు గురైన గోకేడ మహేశ్వరి (ఫైల్)

లక్కవరపుకోట: వారిద్దరూ మంచి స్నేహితులు. ఒకే గ్రామం, ఒకే విధులు కావడంతో ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్లేవారు. వారి మధ్యతలెత్తిన ఆర్థిక విబేధాలతో స్నేహితురాలే నమ్మించి పథకం ప్రకారం తన ప్రియుడితో కలిసి స్నేహితురాలిని హతమార్చింది. ఎల్.కోట మండలం కళ్లేపల్లి గ్రామానికి చెందిన గోకేడ మహేశ్వరి హత్యకేసును పోలీస్‌లు ఛేదించారు. నిందితులను కొత్తవలస కోర్టులో హాజరుపరచడంతో రిమాండ్ విధించారు. ఎల్.కోట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు వెల్లడించారు. కళ్లేపల్లి గ్రామానికి చెందిన గోకేడ మహేశ్వరి, గాడి చిన్నతల్లిలు వైఎస్సార్ క్రాంతి పథంలో బుక్ కీపర్లుగా పనిచేస్తున్నారు. ఒకే ఉద్యోగం కావడంతో ఇరువురి మధ్య ఆర్థిక లావాదేవీలు సాగాయి. ఈ క్రమంలో నిందితురాలు గాడి చిన్నతల్లి స్త్రీనిధి రుణాల్లోని కొంత సొమ్మును తన వ్యక్తిగత అవసరాలకు వాడుకుంది. రుణం డబ్బులు బ్యాంకుకు కట్టే సమయంలో తన స్నేహితురాలు మహేశ్వరి వద్ద అప్పుగా తీసుకొని అప్పుడప్పుడు బ్యాంకులో జమ చేసేది. తర్వాత కాలంలో మహిళా మండలి సభ్యుల నిధులను వీరిద్దరూ వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారు. ఎన్నాళ్లు ఇలా చేస్తాం... నీవు వాడుకున్న డబ్బులు, నా దగ్గర అప్పుగా తీసుకున్న డబ్బులు తీసుకు రా.. నేను వాడుకున్న డబ్బులను తీసుకొచ్చి పూర్తి స్థాయిలో బ్యాంకు రుణాలను చెల్లించి హాయి గా ఉందామని చిన్నతల్లికి మృతురాలు మహేశ్వరి సూచించింది. దీంతో మహేశ్వరిని చంపేస్తే అప్పుగా తీసుకున్న డబ్బులతో పాటు స్త్రీనిధి రుణాలు కట్టాల్సిన అవసరం లేదని చిన్నతల్లి హత్య పథకం రచించింది. రేగ గ్రామానికి చెందిన తన ప్రియుడు డెంకాడ వాసుకు పథకాన్ని వివరించింది. ఇద్దరూ కలిసి ఈ నెల 17వ తేదీన మహేశ్వరిని కారులో ఎక్కించుకుని విజయగనరం మహిళా ప్రాంగణంలో సమావేశానికి బయలుదేరారు. జామి మండలం అలమండ సంత సమీపంలో టిఫిన్ చేశారు. అక్కడ నుంచి భీమసింగి బ్రిడ్జి కిందకు కారును తీసుకెళ్లి ఆపారు. అక్కడ కారు వెనుక సీటులో కూర్చున్న మహేశ్వరితో మాటలు కలిపి ఆమె చున్నీనే పీకకు బిగించి కారులోనే హతమార్చారు. అక్కడ నుంచి నిందితురాలు చిన్నతల్లి ఏమీ తెలియనట్టుగా విజయనగరం సమావేశానికి వెళ్లిపోగా, మృతదేహాన్ని కారు లో జమ్మాదేవిపేట గ్రామం సమీపంలోని సరస్వతీ లేవుట్ వద్ద గల నిర్మానుష్య ప్రాంతం వద్ద పడేసి డెంకాడ వాసు తన ఇంటికి వెళ్లిపోయాడు. మృతదేహం 18వ తేదీన ఉదయం వెలుగు చూసింది. పోలీసులు అన్నికోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఫోన్ లోకేషన్స్, చిన్నతల్లి నడవడికపై నిఘా పెట్టగా చిన్నతల్లి, ఆమె ప్రియుడు డెంకాడ వాసు, మరో ప్రియు డు కోరాడ సాయికుమార్‌తో కలిసి పారిపోయేందుకు సిద్ధమైన సమయంలో లక్కవరపుకోట మండలం గంగుబూడి కూడలి వద్ద పోలీసులు బుధ వారం అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేయగా నేరాన్ని అంగీకరించారని, కోర్టు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ తెలిపారు.

క్లుప్తంగా

వైద్యం సక్రమంగా అందించాలి


వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

మక్కువ: రోగులకు మెరుగైన వైద్యం సక్రమంగా అందించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని శంబర పీహెచ్‌సీని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథం, పీహెచ్‌సీ వైద్యాధికారి రఘుకుమార్‌లున్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

- జిల్లా రవాణా అధికారి మల్లికార్జున రెడ్డి


వాహనాలను తనిఖీ చేస్తున్న జిల్లా రవాణా అధికారి మల్లికార్జున రెడ్డి

పార్వతీపురంటౌన్: స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని పార్వతీపురం మన్యం జిల్లా రవాణా అధికారి మల్లికార్జున రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లా రవాణా కార్యాలయం వద్ద స్కూల్ బస్సులకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో గల 74 స్కూల్ బస్సులకు జూన్ 15వ తేదీ లోగా వాహన సామర్థ్యం(ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్) పునరుద్ధరించుకోవాలని సూచించారు. జిల్లాలోని విద్యాసంస్థల యాజమాన్యాలు వారి స్కూల్ బస్సులకు సంబంధించి రోడ్ ట్యాక్స్, ఇన్సూరెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్‌లను పునరుద్ధరణ చేసుకోవాలన్నారు. నిబంధనలను పాటించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అలాగే బస్సు ముందు భాగంలో పాఠశాల పేరు, చిరునామా, ఫోన్ నంబర్ ఉండాలని స్పష్టం చేశారు. జూన్ 30వ తేదీలోపు క్వార్టర్‌కు సంబంధించి రోడ్ ట్యాక్స్ కట్టని ట్రాన్స్‌పోర్టు వాహనాలు 741 ఉన్నాయని, వాహనాల యాజమానులు పెండింగ్ రోడ్ ట్యాక్స్ 25% శాతం పెనాల్టీతో దగ్గరలో ఉన్న ఆన్‌లైన్ సెంటర్‌లో చెల్లించి ఇన్సూరెన్స్, ఫిటినెస్ సర్టిఫికెట్ రెన్యువల్ లేని వాహనాలు పునరుద్ధరణ చేసుకోవాలని సూచించారు. జిల్లా రవాణా శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక తనిఖీలలో రోడ్ ట్యాక్స్ కట్టని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని వాహనాలు పట్టుబడితే వాహనాలు సీజ్ చేసి 200 శాతం వరకు పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు


తాళ్లబురిడి గ్రామంలో సత్కరించిన వలంటీర్లతో ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లు అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘం, మండలంలోని తాళ్లబురిడి పరిధిలో బుధవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో విశేష సేవలు అందించిన వలంటీర్లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు నాయకులు చేతులు మీదుగా వలంటీర్లందరికీ సచివాలయంల వారీగా శాలువాలు కప్పి, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందచేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న గ్రామ వార్డు వాలంటీర్ల కృషికి గుర్తింపుగా స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రితో గౌరవం అందుకున్న వ్యవస్థ ఒక్క వలంటీర్ వ్యవస్థ అని గుర్తు చేస్తూ వలంటీర్లు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మీరంతా మునుముందు కూడా అన్ని సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందచేసి ఈ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని తెలియ చెప్పవలసిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు వార్డు సచివాలయాల వలంటీర్లు ఘనంగా సన్మానించి సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేసి గౌరవించి శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కె.రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వర రావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కె.బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, జేసీఎస్ కన్వీనర్ జి.మాధవరావు, వార్డు కౌన్సిలర్‌లు, ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


రిబ్బన్ కట్ చేసి నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజల ముంగిటనే ప్రభుత్వ పాలన

ప్రజల ముంగిటకే పరిపాలన అందిస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్వతీపురం మండలం, సంగవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం స్థానిక ప్రజలతో సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు ప్రజల ముంగిటకే ప్రభుత్వ పరిపాలన తీసుకువస్తానని, నేరుగా ప్రతి ఇంటికి సేవలు అందిస్తానని చెప్పి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను తీసుకురావడమే కాకుండా ప్రతి పంచాయతీ పరిధిలో కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి ప్రభుత్వ భవనాలను నిర్మించి ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తెలిపారు. గొప్ప పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రానున్న 2024 సాధారణ ఎన్నికల్లో మళ్ల ముఖ్యమంత్రిగా గెలిపించి ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బలగ రేవతమ్మ ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథ రావు, ఏఎంసీ చైర్‌పర్సన్ మరడాన భాగ్యశ్రీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, గంట రామకృష్ణ, భీమవరం కృష్ణమూర్తి, యాళ్ల ప్రతాప్, వి.గురురాజు, స్థానిక వైస్ సర్పంచ్ బడే శ్రీరంజన్, ఎంపీటీసీ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఎంపీడీఓ, పీఆర్‌డీఈ, సచివాలయం సెక్రటరీలు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పంపిణీలో
వలంటీర్లదే కీలకపాత్ర

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


సేవా పురస్కారాలు పొందిన వలంటీర్లతో డిప్యూటీ సీఎం రాజన్న దొర, మావుడి సోదరులు

మక్కువ: పేద,బడుగు, బలహీన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పంపిణీ చేయడంలో వలంటీర్లదే కీలక పాత్ర అని గిరిజన శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని మార్కొండపుట్టి గ్రామ సచివాలయంలో సోమవారం ఎంపీడీవో పి .దేవకుమార్ ఆధ్వర్యంలో సక్రమంగా సేవలందించిన గ్రామ వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం రాజన్నదొర, ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, ఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం రాజన్న దొర మాట్లాడుతూ మండలంలోని పనసభద్ర, సరాయివలస, మార్కొండపుట్టి సచివాలయాల పరిధిలో ప్రజలకు మంచి సేవలు అందించినందుకు గాను ప్రభుత్వం గుర్తించి వలంటీర్లకు సేవాపురస్కారాలు అందించామన్నారు. కష్టపడి విధులు నిర్వహిస్తున్న వలంటీర్లను, ఏటా ప్రభుత్వం గుర్తించి, సేవా పురస్కారాలు అందిస్తోందన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధి గ్రామ వలంటీర్ అనీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రశంసించారు. అనంతరం వలంటీర్లకు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట విరుద్ధం

- డీఐఓ డాకర్ టి.జగన్‌మోహన్‌రావు
- ఆకస్మికంగా స్కానింగ్ కేంద్రాల తనిఖీ


స్కానింగ్ కేంద్రాలు తనిఖీ చేస్తున్న డీఐఓ జగన్మోహన్ రావు

పార్వతీపురంటౌన్: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం విరుద్ధమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాకర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలో స్కానింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. మెడికల్ డయాగ్నోస్టిక్స్ స్కానింగ్ కేంద్రాల్లో రికార్డులను, స్కానింగ్ యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్కానింగ్, ఇతర స్కానింగ్‌లకు వేర్వేరుగా రికార్డులు ఉండాలని, వివరాలు స్పష్టంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. స్కానింగ్ చేసిన తేదీలు, రిఫర్ చేస్తున్న వైద్యుల వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. స్కానింగ్ చేసిన జాబితాను ప్రతి నెలా విధిగా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు. స్కానింగ్ పూర్తయిన కొంత మంది వివరాలను రికార్డులో పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. స్కానింగ్ యంత్రాలను, రిజిస్ట్రేషన్ రెన్యువల్ గడువు తేదీలను పరిశీలించారు. గర్భిణుల ఆమోదం పొందిన ఫారం, పూర్తి చిరునామా, ఫార్మ్-ఎఫ్ ఆన్‌లైన్ నమోదు చేసి ప్రతినెలా జిల్లా ఆరోగ్య కార్యాలయానికి పంపాలని కోరారు. అనంతరం లింగ నిర్ధారణ నిషిద్ధ చట్టం అవగాహన పోస్టర్లను పరిశీలించి, స్కానింగ్ చేసుకోడానికి వచ్చిన గర్భిణులతో మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షల సమాచారం తెలిస్తే 104 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. తనిఖీల్లో ఆయనతో పాటు డిప్యూటీ డెమోలు వి.సన్యాసిరావు, వై.యోగీశ్వర రెడ్డి, సూపర్‌వైజర్ జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి ఆత్మహత్య


హేమంత్ కుమార్ మృతదేహం

పాచిపెంట: అగ్రికల్చర్ డిప్లమోలో ఫెయిల్ అవడంతో తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో పురుగుమందు తాగి గిరిజన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని అమ్మ వలసలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జట్ల హేమంత్ కుమార్ నెలిపర్తిలో అగ్రికల్చర్ డిప్లమో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు, ప్రథమ సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అవడంతో తల్లిదండ్రులు మందలిస్తారని భయాందోళన చెంది మంగళవారం 11 గంటల సమయంలో ఊరు బయట ఉన్న చెరువు వద్దకు వెళ్లి పురుగుమందు తాగేశాడు. బయటికి వెళ్లిన తన అన్న ఇంకా ఇంటికి రాలేదని తమ్ముడు హేమకుమార్ చెరువు వద్దకు వెళ్లి చూడగా అపస్మారస్థితిలో ఉన్న అన్నను చూసి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు, వెంటనే సాలూరు సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించాడు, మృతుడి తండ్రి జట్ల రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటరమణ పేర్కొన్నారు.

వేధింపులు తాళలేక బాలిక..

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామానికి చెందిన బాలికను ఆదే గ్రామానికి చెందిన మాకిరెడ్డి గాడేలు ప్రేమ పేరుతో వేధిస్తుండడంతో బాలిక తాళలేక బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు ఎస్ఐ బొడ్డు దేవి మాట్లాడుతూ పురుగు మందుతాగి అపస్మాక స్థితిలో ఉన్న బాలికను హుటాహుటిన విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి మహిళ..

భోగాపురం: మండలంలోని బోడిసింగిపేట గ్రామానికి చెందిన కారి అప్పయ్యమ్మ(56) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొంత కాలంగా శ్వాసకోశ సమస్య ఎదుర్కొంటున్న ఆమెకు భర్త సత్తెయ్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సంపాదన అంతా తన మందులకే వస్తున్నాయని ఆర్థికంగా కష్టమవుతోందని మనస్తాపం చెందిన ఆమె మంగళవారం ఉదయం పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో కుమారులు తల్లిని విజయనగరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. భర్త సత్తెయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

బస్సు టైర్లు ఎక్కి ప్రయాణికురాలి కాళ్లకు గాయాలు


ప్రమాదస్థలం వద్ద ఉన్న క్షతగాత్రురాలు

సాలూరు: ప్రయాణికురాలి కాళ్ల మీద నుంచి బస్సు టైర్లు ఎక్కడంతో తీవ్ర గాయాల పాలైంది. ఈ మేరకు పట్టణ ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ప్రకారం, పాచిపెంట మండలం పాంచాలి గ్రామానికి చెందిన కె.చిన్నతల్లి బుధవారం పట్టణంలోని మెయిన్‌రోడ్డులో గల బస్టాండ్ వద్ద పార్వతీపురం బస్సు ఎక్కుతుండగా, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆమె కింద పడిపోయింది. దీంతో ఆమె రెండు కాళ్ల మీదకు బస్సు వెనుక టైర్లు ఎక్కడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్, ఆటో ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు


గాయాల పాలైన పైడిరాజు, అనురాధ, శ్యాం

జామి: ట్రాక్టర్, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జామి మండలం చింతాడ గ్రామానికి చెందిన దేగల పైడిరాజు, కుమార్తె అనూరాధ, కుమారుడు శ్యాం అన్నంరాజుపేట పండగకు వెళ్లి బుధవారం రాత్రి తిరిగి స్వగ్రామం చింతాడకు ఆటోలో వస్తుండగా జాగరం నుంచి జామి వెళ్తున్న ట్రాక్టర్ జాగరం గ్రామం వద్ద ఆటోను ఢీకొంది. దీంతో ప్రమాదంలో ముగ్గురికీ తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హత్యాయత్నం చేసిన నిందితుడి అరెస్టు

రాజాం సిటీ: ఇటీవల రేగిడి మండలం సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్ద హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేశామని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక రూరల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 21న సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్ద సంకిలి గ్రామానికి చెందిన కర్రి రమణపై పాలకొండకు చెందిన లక్ష్మీనారాయణ కత్తితో దాడిచేసి గాయపరిచాడు. రమణ మెటీరియల్ సప్‌లెర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పాలకొండకు చెందిన తిరుమల కనస్ట్రక్షన్ సూపర్‌వైజర్‌గా లక్ష్మీనారాయణ పనిచేస్తున్నాడు. తిరుమల కనస్ట్రక్షన్స్ యాజమాన్యం రమణకు రూ.4.70 లక్షలు బకాయి పడింది. దీంతో తన నగదు చెల్లించాలని సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణను రమణ అడగడంతో దాడిచేసి గాయపర్చి పరారయ్యాడు. ఈ క్రమంలో ఎస్సై ఇ.శ్రీనివాస్ సిబ్బంది, పాలకొండ మండలం బూరాడ జంక్షన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆర్థిక లావాదేవీలతోనే ఈ ఘటన జరిగిందని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఎస్సై ఇ.శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.